క్లుప్తంగా

ఆటోలో మర్చిపోయిన బ్యాగ్ అప్పగింత

బీచ్ రోడ్డు: ఆటోలో మర్చిపోయిన ట్రాలీ బ్యాగ్‌ను తిరిగి యజమానికి త్రీ టౌన్ క్రైం పోలీసులు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో 112 నంబరుకు రాజేష్‌బాబు అనే వ్యక్తి ఫోన్ చేసి ఆటోలో తన లగేజీ బ్యాగ్ మర్చిపోయినట్టు ఫిర్యాదు చేశారు. పోలీసు బెరాక్స్ నుంచి వుడా పార్క్ వరకు ఆటోలో ప్రయాణించినట్టు తెలిపారు. దీనిపై త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందగా.. క్రైం ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించి ఆటోను గుర్తించారు. అనంతరం బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని సోమవారం యజమానికి అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.

ఎంవీపీ కాలనీలో రెండు వాహనాల దహనం



కాలిపోయిన వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–12 సమీపంలోని ఇందిరానగర్‌లో ఆకతాయిలు రెచ్చిపోయారు. ఆదివారం అర్ధరాత్రి స్థానికంగా ఓ ఇంటి ముందు పార్కు చేసిన రెండు ద్విచక్ర వాహనాలకు పెట్రోల్ పోసి నిప్పటించారు. దీంతో వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. ఈ క్రమంలో భారీగా మంటలు చెలరేగడాన్ని గుర్తించిన స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. చివరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అనంతరం ఎంవీపీ కాలనీ పోలీసులు వచ్చి ఘటనపై ఆరా తీశారు. అయితే ఇది స్థానికంగా ఉండే ఆకతాయిల పనేనని, కక్షపూరితంగా వాహనాలను తగలబెట్టారని పోలీసులు భావిస్తున్నారు. గోవింద్ అనే వ్యక్తి ఫిర్యాదుతో చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు స్థానికంగా ఉన్న కొందరి నుంచి వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై చర్యలకు డిమాండ్

మద్దిలపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన ఏయూ వీసీ, రిజిస్ట్రార్‌లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లోకనాథం డిమాండ్ చేశారు. పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓ ప్రైవేటు హోటల్‌లో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేయడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, ఆర్కే ఎస్వీ కుమార్ పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజార్ స్టాళ్లకు డ్రా



రైతులకు స్టాల్ నంబర్ టోకెన్ అందిస్తున్న సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు సోమవారం డ్రా తీశారు. ఉదయం, సాయంత్రం వేళ 63 స్టాళ్లకు మార్కెటింగ్ శాఖ సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు డ్రా తీసి రైతులు, వ్యాపారులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా రైతుబజార్ ఈవో కొండబాబు మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతి సోమవారం రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. మంగళవారం రైతుబజార్‌కు సెలవు కావడంతో బుధవారం రైతులు వారికి కేటాయించిన స్టాళ్లల్లో వ్యాపారం నిర్వహిస్తారని చెప్పారు. రైతు బజార్ సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

ముందే మేల్కొంటే పదిలం


- అక్కడక్కడా పాడైన విమ్స్ భవనాలు
- కొద్ది పాటి మరమ్మతులు చేపడితే మేలు




ఆపరేషన్ థియేటర్ ద్వారం వద్ద ఊడిపోయిన పలకలు



శిథిలమైన విమ్స్ బయట స్తంభం



ఐసీయూ గదిలో పాడైన గచ్చు



పెచ్చులూడుతున్న గోడ

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) భవనాలకు అక్కడక్కడా చిల్లులు దర్శనమిస్తున్నాయి. గచ్చులు, గోడలు శిథిలమయ్యాయి. అధికారులు కూడా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రి భవనం బయట గోడలు, స్తంభాలకు పలుచోట్ల చెమ్మపట్టి పెచ్చులు ఊడిపోతున్నాయి. స్తంభాల లోపల ఉన్న ఇనుప ఊచలు సైతం బయటకు కనిపిస్తున్నాయి. ఆస్పత్రి ఓపీ ఎదురుగా ఉన్న బ్లాక్ ద్వారం ముందు రోగులు, వారి బంధువులు నడవడానికి వీలుగా అమర్చిన పలకలు బాగా దెబ్బతిన్నాయి. ఇటీవల వాటికి మరమ్మతులు చేపట్టారు. అయినా మళ్లీ గచ్చు ఊడిపోయింది. దీంతో పాటు ఆస్పత్రి లోపల పలుచోట్ల గచ్చు, టైల్స్ శిథిలమయ్యాయి. ఐసీయూ గదిలో గచ్చుకు అమర్చిన పెద్ద సైజు టైల్స్ విరిగిపోయాయి. ఇదే గదిలో మిగిలి టైల్స్ కూడా విరిగిపోయే పరిస్థితిలో ఉన్నాయి. రెండో ఫ్లోర్‌లో ఉన్న ఆపరేషన్ థియేటర్ ద్వారం వద్ద పలకలు ఊడిపోయి గొయ్యిగా మారింది. దీంతో ఆపరేషన్ అనంతరం సిబ్బంది స్ట్రెచర్‌పై రోగిని తీసుకురావడానికి ఇబ్బందవుతోంది. విమ్స్ వైద్యాధికారులు ముందుగానే మేల్కొని ఇక్కడ గోడలు, గచ్చులకు మరమ్మతులు చేపడితే మరింత కాలం భవనాలు పదిలంగా ఉంటాయని రోగుల బంధువులు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

‘బీసీలకు వెన్నెముక ముఖ్యమంత్రి వైఎస్ జగన్’



మాట్లాడుతున్న బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్

ఏయూ క్యాంపస్: వెనుకబడిన తరగతులకు వెన్నెముకగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్ తెలిపారు. సోమవారం ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాలో అత్యధికంగా వెనుకబడిన తరగతుల నుంచి ఎంపిక చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఏయూలో విలేకరులతో ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి అడుగడుగునా బీసీలను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారన్నారు. తాజాగా బీసీ సామాజిక వర్గాలకు చెందిన 11 మందికి ఎమ్మెల్సీ పదవులను కేటాయించడం వైఎస్ జగన్ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పాలనలో బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తూ సమగ్రంగా అభివృద్ధి చెందడానికి అవసరమైన పాలనా పదవులను సైతం అప్పగిస్తున్నారని చెప్పారు. రాజ్యాధికారాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. బీసీలను బ్యాక్ బోన్‌గా చూస్తూ వారిని ప్రోత్సహిస్తున్న విధానం హర్షణీయమన్నారు. గత ప్రభుత్వాలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్నాయని, నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారికి పాలనా పగ్గాలను అందిస్తూ ముందుకు నడిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర యువత అధ్యక్షుడు వి.శ్యామ్ సుందర్ నాయుడు, పి.ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కంబాల కొండలో పిల్లల భద్రతకు ప్రత్యేక చర్యలు



కంబాలకొండలో ఆట పరికరాల వద్ద వేస్తున్న ఇసుక

ఆరిలోవ: కంబాలకొండ ఏకో టూరిజం పార్కులో ఉన్న ఆట పరికరాలు వద్ద పిల్లలకు సౌకర్యవంతంగా ఉండేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆట పరికరాల వద్ద పిల్లలు ఆడుతున్నప్పుడు కింద పడినా వారికి ఎలాంటి గాయాలు కాకుండా నేలపై ఇసుక వేస్తున్నారు. రెండు నెలల క్రితం పీసీసీఎఫ్ మధుసూదన రెడ్డి కంబాలకొండ పార్కును సందర్శించారు. ఇక్కడ తుప్పుపట్టిన పరికరాలు, కిందన గట్టి నేల ఉండడాన్ని పరిశీలించారు. దీంతో పరికరాలను బాగు చేయించి కిందన మెత్తని ఇసుక వేయాలని అటవీ శాఖ అధికారులకు ఆయన సూచించారు. ఈ మేరకు ఇటీవల ఇక్కడ ఆట పరికరాలకు మరమ్మతులు చేపట్టి రంగులు వేయించారు. ప్రస్తుతం ఆట పరికరాలు అమర్చిన సుమారు 1000 చదరపు గజాల విస్తీర్ణంలో లారీలతో ఇసుక తీసుకొచ్చి వేస్తున్నారు. సుమారు అడుగు ఎత్తులో వేసి చదును చేయనున్నారు. దీంతో పాటు ఇక్కడ పిల్లల తల్లిదండ్రులు కూర్చోవడానికి వీలుగా కర్రలతో తయారు చేసిన బెంచీలు ఏర్పాటు చేయనున్నారు.

దొరకని మత్స్యకారుల ఆచూకీ



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఎంవీపీకాలనీ: సముద్రంలో గల్లంతైన ఉమ్మిడి అనిల్(23), మరుపల్లి ప్రవీణ్‌కుమార్ (22) ఆచూకీ లభించలేదు. ఆదివారం మధ్యాహ్నం నుంచి పోలీసులు గజ ఈతగాళ్లు, కోస్ట్ గార్డ్, నాటు బోట్లు సాయంతో పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. ఏ క్షణంలోనైనా అనిల్, మరుపల్లి ప్రవీణ్ కుమార్‌ల ఆచూకీ లభిస్తుందని మత్స్యకార కుటుంబాలు ఆశగా ఎదురుచూశాయి. అయితే గాలింపు చర్యలు ముమ్మరంగా జరిగినప్పటికీ సోమవారం రాత్రి వరకు ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో కడసారి చూసుకోవాలని ఆవేదన చెందుతున్న కుటుంబ సభ్యులకు నిరాశే మిగిలింది. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల సోమవారం సాయంత్రం బాధిత కుటుంబాలను పరామర్శించారు. గాలింపు చర్యలపై అధికారుల నుంచి ఆరా తీసిన ఆమె అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కొద్దిసేపు వాసవానిపాలెం తీరంలో కుటుంబ సభ్యులతో పాటు గడిపిన ఆమె ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకురాలు సూరాడ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రశాంతిరెడ్డి



వేదాశీర్వాదం అందుకుంటున్న ప్రశాంతిరెడ్డి

కొమ్మాది: రుషికొండలో గల మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వర స్వామిని సోమవారం ఢిల్లీ టీటీడీ లోకల్ ఏరియా కమిటీ చైర్మన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆమెకు టీటీడీ అర్చకులు వేదాశీర్వాదంతో పాటు ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఆహ్లాదకర వాతావరణంలో సముద్రానికి అభిముఖంగా శ్రీవారి ఆలయ నిర్మాణం చేయడం ఎంతో అద్భుతమన్నారు. ఈమె వెంట ఆలయ ఏఈవో రమేష్, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా పార్లమెంటరీ యువజన అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వచ్చేనెల 20 నుంచి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు



పరీక్షల వివరాలు విడుదల చేస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్‌లో ప్రవేశం పొందిన వారికి మార్చి 20 నుంచి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏయూ టీడీఆర్ హబ్ డీన్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలియజేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమ వారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి విడుదల చేశారు. ప్రీ పీహెచ్‌డీ పరీక్షకు ఈ నెల 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏయూ టీడీఆర్ వెబ్‌సైటులో సంబంధిత వివరాలు నమోదు చేసి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని, సబ్జెక్టుల వారీగా పరీక్ష తేదీలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు

- ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ స్పెషల్ డ్రైవ్



విశాఖ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ విశాల్ గున్ని ఆదేశాలతో, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.వి.ఎస్.నాగేశ్వరరావు సూచనలతో సోమవారం విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు(జీఆర్పీ) స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. విశాఖ రైల్వే స్టేషన్‌లో, ప్లాట్‌ఫారాలపై, వివిధ రైళ్లు, వెయిటింగ్ హాల్స్, పార్సిల్ కార్యాలయాల వద్ద గంజాయి, స్మగ్లింగ్, నిషేధిత డ్రగ్స్ కోసం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో జీఆర్పీ సిబ్బందితోపాటు ఆర్పీఎఫ్ ఎస్‌ఐ చంద్రమోహన్, ఏఎస్‌ఐ అనంతరావు, డాగ్ స్క్వాడ్ పాల్గొన్నాయి.

గంజాయి పట్టివేత..

ఈ తనిఖీల్లో భాగంగా విశాఖ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 3 వద్ద అనుమానిత, వదిలేసిన లగేజీని రైల్వే పోలీసులు తనిఖీ చేయగా.. దీనిలో 10 కేజీల గంజాయి ఉన్నట్లు కనుగొని, సీజ్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితులను కోసం దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ సీఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.

అర్జీలకు రసీదులు ఇవ్వకపోతే చర్యలు



సమీక్ష నిర్వహిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

మధురవాడ: సచివాలయాల్లో స్వీకరించే ప్రతీ అర్జీ, ఫిర్యాదులకు కచ్చితంగా రసీదు ఇవ్వాలని జీవీఎంసీ మధురవాడ జోన్–2 కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి ఆదేశించారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో రెవెన్యూ వసూళ్లు, ఇతర అంశాలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయంలో వివిధ రకాల సేవలు, సమస్యలపై వస్తున్న అర్జీలు, ఫిర్యాదులకు రసీదు ఇవ్వలేదని ఫిర్యాదులు వస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేయడానికే సచివాలయ వ్యవస్థ అన్న విషయాన్ని అంతా దృష్టిలో ఉంచుకోవాలన్నారు. జోన్‌లో ఉన్న అన్ని సచివాలయాల అడ్మిన్లు జీవీఎంసీ ఆదాయం పెంచడంపై దృష్టి సారించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ ముగడ రాజు పాల్గొన్నారు.

అశోక్ దృష్టికి ట్రస్ట్‌బోర్డు అజెండా

సింహాచలం : శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశం మార్చి 1న నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు అజెండాలోని అంశాలను సోమవారం దేవస్థానం ఈవో త్రినాథరావు, ఈఈ శ్రీనివాసరాజు ట్రస్ట్ బోర్డు చైర్మన్ అశోక్‌గజపతిరాజుని విజయనగరంలోని స్వగృహంలో కలిసి వివరించారు. మార్చిలో స్వామి వారి వార్షిక కల్యాణోత్సవం, ఏప్రిల్‌లో చందనోత్సవం నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు, వివిధ పనులకు సంబంధించి సుమారు 40 అంశాలతో దేవస్థానం అధికారులు అజెండా సిద్ధం చేశారు. ఈ మేరకు అధికారులు సంబంధిత అజెండాతో అశోక్‌గజపతిరాజును కలిశారు. వచ్చే నెల 1న సమావేశం నిర్వహించేందుకు ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది.

సీతమ్మధార రైతుబజార్ వద్ద పార్కింగ్ జోన్

- అక్కడి ఖాళీ స్థలంలో ఏర్పాటు చేయండి
- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ఆదేశం



ప్లాన్ పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్ వద్ద ఉన్న జీవీఎంసీ ఖాళీ స్థలాన్ని పార్కింగ్ జోన్‌గా వినియోగించాలని అధికారులను జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశించారు. జోన్–3 పరిధిలోని సీతమ్మధార రైతుబజార్ నుంచి ఏఎంజీ ఆస్పత్రి వరకు సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుబజార్ వద్ద స్థలంలో పార్కింగ్ జోన్ ఏర్పాటుతోపాటు రోడ్డు ఆక్రమణలు తొలగించి నడక దారి నిర్మించాలన్నారు. వాహనాలను ఒక క్రమపద్ధతిలో పెట్టుకునేందుకు, ఆ పార్కింగ్ స్థలంలోనే అనువైన చోట్ల వాకర్స్‌కు నడక దారి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆధునిక టాయిలెట్లు నిర్మించాలన్నారు. ఈ పనులకు సబంధించి ప్లాన్‌ను పరిశీలించారు.

పరిశుభ్రంగా రైతుబజార్ పరిసరాలు

సీతమ్మధార రైతుబజార్‌లోని పరిసరాలను ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించి, కాలువలోని పూడికలు తీయించాలని కమిషనర్ రాజాబాబు సూచించారు. బజార్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా కనిపిస్తున్నాయని, వ్యాపారులు, దుకాణదారులు వినియోగదారులకు ప్లాస్టిక్ కవర్లు ఇవ్వకుండా నిరోధించాలని ప్రజారోగ్యం అధికారులను ఆదేశించారు. పర్యటనలో ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, పట్టణ ప్రణాళికాధికారి బి.సురేష్‌కుమార్, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణరాజు, డీసీపీ పద్మజ, ఏసీపీ వెంకటేశ్వరరావు, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాస్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు, శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



పెదగదిలి నుంచి కలశాలతో విజయదుర్గాదేవి ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



విజయదుర్గాదేవి ఆలయంలో క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

ఆరిలోవ: హనుమంతవాక దరి విజయదుర్గా కాలనీలో విజయదుర్గాదేవి అమ్మవారి ఆలయ 21వ వార్షికోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం ఉదయం అమ్మవారికి కలశ స్థాపన, క్షీరాభిషేకం చేశారు. మొదటగా పెదగదిలిలోని పోలమాంబ గుడి వద్ద పూజలు చేసి అనంతరం మహిళలు 108 కలశాలతో ఊరేగింపుగా బయలుదేరి మేళతాళాల మధ్య సంజయ్‌గాంధీ కాలనీ మీదుగా విజయదుర్గాదేవి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ప్రధాన అర్చకుడు మావుడూరు సంపత్‌కుమార్‌శర్మ వేద మంత్రాల మధ్య మహిళల స్వహస్తాలతో క్షీరాభిషేకం చేయించారు. మంగళవారం అమ్మవారికి మహిళలతో సామూహిక లక్ష కుంకుమార్చన, మధ్యాహ్నం భక్తులు అన్నసమారాధన నిర్వహించనున్నారు.

విద్యా సమాచారమ్

విద్యార్థులు మెరైన్ సైంటిస్ట్‌లుగా రాణించాలి



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు అత్యుత్తమ మెరైన్ సైంటిస్ట్‌లుగా రాణించాలని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఏయూ సెంటర్ ఫర్ స్టడీస్ ఆన్ బే ఆఫ్ బెంగాల్, సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్(ఇన్‌కాయిస్) సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సమాచారం ప్రాధాన్యం, కచ్చితత్వం, డేటా మోడలింగ్ ఆవశ్యకతలను వివరించారు. ఇన్‌కాయిస్ శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణన్ నాయర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఉన్న ఓషన్ అబ్జర్వేషన్ సిస్టమ్ పనితీరును తెలియజేశారు. సునామీలను ముందస్తుగా గుర్తించడం, అత్యధికంగా మత్స్య సంపద కలిగి ఉండే ప్రాంతాల గుర్తించి మత్స్యకారులకు తెలియజేయడంలో నూతనంగా అభివృద్ధి చేసిన విధానాలు, వ్యవస్థలను వివరించారు. గంగవరం పోర్టు పూర్వ హార్బర్ మాస్టర్ కెప్టెన్ మహంతి మాట్లాడుతూ ముందస్తు అంచనాలు ఇవ్వడంలో ఖచ్చితత్వాన్ని కలిగి ఉండడం ఎంతో ప్రధానమని సూచించారు. సీఎస్‌బీవోబీ డైరెక్టర్ ఆచార్య పి.రామారావు, సీనియర్ ఆచార్యుడు పి.రాజేంద్రప్రసాద్, జియో ఫిజిక్స్ ఆచార్యుడు బి.ఆనందగజపతిరాజు తదితరులు ప్రసంగించారు. 35 మంది యువ శాస్త్రవేత్తలు, వివిధ విద్యా సంస్థలు, పరిశోధన కేంద్రాల ప్రతినిధులు 16 మంది ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏయూ సందర్శన



వాసూరావును సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు సాలూరి వాసూరావు సోమవారం సందర్శించారు. వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సాలూరు వాసురావును వీసీ సత్కరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సంగీత విభాగాన్ని సందర్శించాలని ఆహ్వానించారు. ఏయూలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా సాలూరి వాసూరావు వీసీ ప్రసాదరెడ్డికి ప్రత్యేకంగా భగవద్గీత భావ చిత్ర సుధ పుస్తకాన్ని బహూకరించారు.

పబ్లిక్ డిమాండ్

యథేచ్ఛగా అనధికారిక పార్కింగ్



సర్వీసు రోడ్డు పక్కనే పార్క్ చేసిన వాహనాలు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15 వార్డు పరిధి హెచ్‌బీ కాలనీ ప్రధాన రహదారిపై ఎక్కడికక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. ఈ మార్గంలో ఇరువైపులా వాణిజ్య సముదాయాలు ఉండడంతో వినియోగదారుల వాహనాలతో రద్దీగా మారుతోంది. హెచ్‌బీ కాలనీ నుంచి పాత వెంకోజీపాలెం మీదుగా జాతీయ రహదారిపై ఆంజనేయస్వామి విగ్రహం వరకు ఇదే పరిస్థితి నెలకొంది. మద్దిలపాలెం నుంచి పిఠాపురం కాలనీకి వెళ్లే మార్గంలో ఆంధ్రా బ్యాంకు, జనశిక్షణా సంస్థాన్ ప్రాంతాలలో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు రోజుల తరబడి పార్కింగ్ చేసి ఉన్నాయి. పోలీసులు స్పందించి తక్షణం వీటిని తొలగించాలి. – ఆర్.అప్పలచారి, శివాజీపాలెం